No. 2 2017

# కావలికోట

యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది



## దేవుని అత్యంత గొప్ప బహుమానాన్ని మీరు అందుకుంటారా?

యేసు మరణ జ్ఞాపకార్థ రోజు | మంగళవారం, ఏప్రిల్ 11, 2017



## మీరేమంటారు?

దేవుడు మనకు ఇచ్చిన అతి గొప్ప బహుమానం ఏంటి? *బైబిలు ఇలా చెప్తుంది: "దేవుడు లోకంలోని ప్రజల్ని ఎంతో ప్రేమించాడు, ఎంతగా అంటే వాళ్లకోసం తన ఒక్కగానొక్క కొడుకును ఇచ్చాడు."—యోహాను 3:16.*

ఈ కావలికోట దేవుడు యేసును మనకోసం చనిపోవడానికి భూమి మీదకు ఎందుకు పంపించాడు, మనం ఆ బహుమానానికి ఎలా కృతజ్ఞత చూపించవచ్చు అనే విషయాలు వివరిస్తుంది.

## దేవుని అత్యంత గొప్ప బహుమానాన్ని మీరు అందుకుంటారా?


3 ఇలాంటి బహుమానం ఇంకెక్కడా లేదు

4 దేవుడు ఇచ్చిన అత్యంత గొప్ప బహుమానం ఎందుకు అంత అమూల్యమైంది?

6 దేవుడు ఇచ్చిన అత్యంత గొప్ప బహుమానానికి మీరు ఎలా స్పందిస్తారు?


### ఇంకా ఈ పత్రికలో


**8 క్రైస్తవ మతగురువులు పెళ్లికి, లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలా?**

**10 బానిసత్వం నుండి విడుదల—అప్పుడు, ఇప్పుడు**

**13 ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని రుచి చూడండి**

**16 బైబిలు ఏం చెప్తుంది?**


JW.ORG™

**మీకు ఇంకా ఎక్కువ తెలుసుకోవాలనుందా? మీ ఇంట్లోనే ఉచితంగా బైబిలు గురించి నేర్చుకోవాలనుందా?**

www.jw.org/te వెబ్‌సైట్ చూడండి లేదా మీ రిక్వెస్టును ఈ క్రింది అడ్రస్‌కు పంపించండి.


For the UNITED STATES OF AMERICA:
Jehovah's Witnesses
1000 Red Mills Road
Wallkill, NY 12589-3299

For CANADA:
Jehovah's Witnesses
PO Box 4100
Georgetown, ON L7G 4Y4


ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని అడ్రస్‌ల కోసం www.jw.org/contact చూడండి.



**యేసు బలి "అనేకుల కోసం విమోచన క్రయధనం" ఎలా అయ్యింది?**


(బైబిలు బోధలు > బైబిలు ప్రశ్నలకు జవాబులు చూడండి)



**కావలికోట**
యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది

**Vol. 138, No. 4 2017 TELUGU**

ప్రతీ సంచిక ముద్రణ: 6,16,51,000
297 భాషల్లో ఉంది


**ఈ ప్రచురణ అమ్మకానికి కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న బైబిలు విద్యాపనిలో భాగంగా స్వచ్ఛంద విరాళాల సహాయంతో ప్రచురించబడుతోంది.**

**విరాళాలు ఇవ్వాలనుకుంటే, www.jw.org వెబ్‌సైట్ చూడండి.**

ఇందులో ఆదికాండము నుండి మలాకీ వరకున్న లేఖనాలు పరిశుద్ధ గ్రంథము నుండి ఉల్లేఖించబడ్డాయి. ఒకవేళ ఆ లేఖనాల పక్కన *NW* అని ఉంటే అవి ఇంగ్లీషులోని న్యూ వరల్డ్ ట్రాన్స్‌లేషన్ ఆఫ్ ద హోలీ స్క్రిప్చర్స్ నుండి అనువదించినవని అర్థం. మత్తయి నుండి ప్రకటన వరకున్న లేఖనాలు పవిత్ర బైబిలు కొత్త లోక అనువాదం (మత్తయి – ప్రకటన) నుండి ఉల్లేఖించబడ్డాయి. అలా కాకుండా లేఖనాల్ని ఇతర బైబిలు అనువాదాల నుండి ఉల్లేఖించివుంటే, వాటి పక్కన ఆ అనువాదం పేరు సూచించబడింది. కొన్ని లేఖనాల్లో విషయాన్ని నొక్కి చెప్పడానికి **ఏటవాలుగావున్న ముద్దక్షరాలు** ఉపయోగించబడ్డాయి.

కావలికోట అనే ఈ పత్రిక, విశ్వ పరిపాలకుడైన యెహోవా దేవుణ్ణి ఘనపరుస్తుంది. పరలోకంలో పరిపాలిస్తున్న దేవుని రాజ్యం త్వరలో చెడుతనాన్ని పూర్తిగా తీసివేసి, భూమిని సుందరమైన ఉద్యానవనంలా మారుస్తుందనే మంచివార్త చెబుతూ ఇది ప్రజలకు ఊరటనిస్తుంది. మనం నిరంతరం జీవించడం కోసం తన ప్రాణాన్ని అర్పించి, ప్రస్తుతం దేవుని రాజ్యాన్ని పరిపాలిస్తున్న యేసుక్రీస్తు మీద విశ్వాసం ఉంచమని ప్రోత్సహిస్తుంది. 1879 నుండి క్రమం తప్పకుండా ప్రచురించబడుతున్న ఈ పత్రికకు రాజకీయాలతో ఎలాంటి సంబంధమూ లేదు. దీనికి బైబిలే ఆధారం.


*The Watchtower* (ISSN 0043-1087) Issue 4 March 2017 is published monthly with an additional issue published in January, March, May, July, September, and November by Watchtower Bible and Tract Society of New York, Inc.; L. Weaver, Jr., President; G. F. Simonis, Secretary-Treasurer; 1000 Red Mills Road, Wallkill, NY 12589-3299, and by Watch Tower Bible and Tract Society of Canada, PO Box 4100, Georgetown, ON L7G 4Y4. Periodicals Postage Paid at Brooklyn, NY, and at additional mailing offices. **POSTMASTER:** Send address changes to Watchtower, 1000 Red Mills Road, **Wallkill, NY 12589-3299.**


© 2016 Watch Tower Bible and Tract Society of Pennsylvania.


Printed in Canada.



పత్రిక ముఖ్యాంశం

# ఇలాంటి బహుమానం ఇంకెక్కడా లేదు

జార్డన్ చేతిలో ఓడ ఆకారంలో ఉన్న పెన్సిల్ షార్ప్‌నర్ ప్రత్యేకమైనది కాకపోయినా, అది ఆయనకు చాలా విలువైంది. జార్డన్ ఇలా అంటున్నాడు: "నేను చాలా చిన్నగా ఉన్నప్పుడు, మా కుటుంబానికి దగ్గరి స్నేహితుడు ఒకరు నాకు దీన్ని ఇచ్చారు. ఆయన వయసులో పెద్దవాడు, ఆయన పేరు రస్సెల్." జార్డన్ తల్లిదండ్రుల, తాతయ్య జీవితాల్లో రస్సెల్ పాత్ర చాలా ఉందని, కష్టకాలాల్లో వాళ్లకు చాలా తోడుగా ఉన్నాడని ఆయన చనిపోయాక జార్డన్‌కు తెలిసింది. "నేను రస్సెల్ గురించి ఇప్పుడు ఎక్కువ తెలుసుకున్నాను కాబట్టి ఈ చిన్న బహుమానానికున్న విలువ ఇంకా పెరిగింది," అని జార్డన్ చెప్తున్నాడు.

కొంతమంది దృష్టిలో ఒక బహుమానం విలువ చాలా తక్కువ లేదా అస్సలు లేకపోవచ్చు. జార్డన్ ఉదాహరణ చూపిస్తున్నట్లు, ఆ బహుమానాన్ని పొందినవాళ్లు మాత్రం దాన్ని ఎంతో అమూల్యంగా, కొన్నిసార్లు వెలకట్టలేనిదిగా చూస్తారు. బైబిలులో వెల కట్టలేని ఒక గొప్ప బహుమానం గురించి ఇలా ఉంది: "దేవుడు లోకంలోని ప్రజల్ని ఎంతో ప్రేమించాడు, ఎంతగా అంటే వాళ్లకోసం తన ఒక్కగానొక్క కొడుకును ఇచ్చాడు. ఆయన మీద విశ్వాసం ఉంచే ఏ ఒక్కరూ నాశనం కాకుండా శాశ్వత జీవితం పొందాలని అలా చేశాడు."—యోహాను 3:16.

ఆ బహుమానం పొందినవాళ్లకు అది శాశ్వత జీవితం ఇస్తుంది కాబట్టి, అంతకంటే గొప్ప బహుమానం ఇంకొకటి ఉంటుందా? ఆ బహుమానం విలువ కొందరు గుర్తించకపోయినా, నిజ క్రైస్తవులు దాన్ని అమూల్యమైనదిగా చూస్తారు. (కీర్తన 49:8, 9; 1 పేతురు 1:18, 19) లోకం కోసం ఒక బహుమానంగా దేవుడు తన కొడుకు ప్రాణాన్ని ఎందుకు ఇచ్చాడు?

ఎందుకో అపొస్తలుడైన పౌలు ఇలా వివరిస్తున్నాడు: "ఒక మనిషి ద్వారా పాపం, పాపం ద్వారా మరణం లోకంలోకి ప్రవేశించాయి. అదే విధంగా, అందరూ పాపం చేశారు కాబట్టి మరణం అందరికీ వ్యాపించింది." (రోమీయులు 5:12) మొదటి మనిషి ఆదాము తెలిసి కూడా దేవుని మాట వినకుండా పాపం చేశాడు. అందుకు ఆయన మరణం అనే శిక్ష పొందాడు. ఆదాము ద్వారా, ఆయన సంతానంలో అందరూ, అంటే మనుషులు అందరూ మరణాన్ని పొందారు.

"పాపంవల్ల వచ్చే జీతం మరణం, కానీ దేవుడు ఇచ్చే బహుమానం మన ప్రభువైన క్రీస్తుయేసు ద్వారా శాశ్వత జీవితం." (రోమీయులు 6:23) మరణ దండన నుండి మనుషులను విడిపించడానికి, దేవుడు తన కొడుకుని అంటే యేసుక్రీస్తుని భూమి మీదకు పంపించాడు. ఏ లోపంలేని యేసు ప్రాణాన్ని ఈ లోకంలో ప్రజల కోసం అర్పించాడు. ఆ బలిని "విమోచన క్రయధనం" అంటారు. యేసు మీద విశ్వాసం చూపించే వాళ్లందరూ ఆ బలి ఆధారంగా శాశ్వత జీవాన్ని పొందుతారు.—రోమీయులు 3:24.

యేసుక్రీస్తు ద్వారా దేవుడు తన ఆరాధకులకు ఇచ్చిన ఆశీర్వాదాలన్నిటి గురించి పౌలు "వర్ణించలేని దేవుని బహుమానాన్ని బట్టి ఆయనకు కృతజ్ఞతలు" అని అన్నాడు. (2 కొరింథీయులు 9:15) విమోచన క్రయధనానికి ఉన్న గొప్పతనాన్ని మనం వర్ణించలేము. అయినప్పటికీ, దేవుడు తన కృపతో మనుషులకు ఇచ్చిన బహుమానాలన్నిటిలో విమోచన క్రయధనమే గొప్పదని ఎందుకు చెప్పవచ్చు? దేవుడు ఇచ్చిన వేరే బహుమానాలతో పోలిస్తే ఇదే ప్రత్యేకమైందని ఎలా చెప్పవచ్చు?* మనం దానికి ఎలా ప్రతిస్పందించాలి? ఈ ప్రశ్నలకు తర్వాతి రెండు ఆర్టికల్స్‌లో బైబిల్లో ఉన్న జవాబులు చదవమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం.

* యేసు ఇష్టపూర్వకంగా "తన ప్రాణాన్ని మనకోసం అర్పించాడు." (1 యోహాను 3:16) అయితే, ఆ త్యాగం **దేవుని** ఉద్దేశంలో భాగం కాబట్టి, దీనికి సంబంధించిన ఆర్టికల్స్ అన్నిటిలో విమోచన క్రయధనం ఏర్పాటు చేయడంలో దేవుని పాత్ర గురించి ముఖ్యంగా ఉంది.

# దేవుడు ఇచ్చిన అత్యంత గొప్ప బహుమానం ఎందుకు అంత అమూల్యమైంది?

ఏదైనా ఒక బహుమానం మీకెప్పుడు అమూల్యంగా ఉంటుంది? (1) ఆ బహుమానం మీకు **ఎవరు** ఇచ్చారు? (2) **ఎందుకు** ఇచ్చారు? (3) ఆ బహుమానం ఇవ్వడానికి వాళ్లు ఏమి ***త్యాగం*** చేశారు? (4) ఆ బహుమానం ఏదైనా **అవసరాన్ని** తీర్చిందా? అనే విషయాలను బట్టి అమూల్యంగా ఉంటుంది. దేవుడు ఇచ్చిన అత్యంత గొప్ప బహుమానం పట్ల మన కృతజ్ఞతను పెంచుకోవాలంటే ఈ విషయాలు గురించి ఆలోచించడం మంచిది.



## ఎవరు ఇచ్చారు?

అధికారంలో చాలా పెద్దవాళ్లు లేదా మనం ఎంతో గౌరవించే వాళ్లు ఏదైనా బహుమానం ఇస్తే మనం ఆ బహుమానాన్ని చాలా అమూల్యంగా ఎంచుతాం. ఇంతకుముందు చూసిన జార్డన్ ఉదాహరణలా, కొన్ని బహుమానాలు ఖరీదైనవి కాకపోయినా మనం ప్రేమించే కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన స్నేహితులు ఇస్తే, మనం వాటిని ఎంతో విలువైనవిగా చూస్తాం. ఇదే విషయాన్ని విమోచన క్రయధన బహుమానంతో పోల్చి ఏమని చెప్పవచ్చు?

మొదటిగా, "దేవుడు తన ఒక్కగానొక్క కొడుకును ఈ లోకంలోకి పంపించి . . . మనం ఆ కొడుకు ద్వారా జీవం సంపాదించుకునేలా దేవుడు ఆయన్ని పంపించాడు." (1 యోహాను 4:9) ఈ విషయం బట్టి ఆ బహుమానం నిజంగా అమూల్యమైనది అని చెప్పవచ్చు. అధికారంలో దేవుని కంటే గొప్పవాళ్లు ఇంకెవరూ లేరు. ఆయన గురించి ఒక హీబ్రూ కీర్తనకర్త ఇలా రాశాడు: "యెహోవా అను నామము ధరించిన నీవు మాత్రమే సర్వలోకములో మహోన్నతుడవని వారెరుగుదురుగాక." (కీర్తన 83:18) మనకు బహుమానం ఇవ్వగలిగినవాళ్లలో ఇంతకన్నా గొప్పవాళ్లు ఇంకెవ్వరూ ఇవ్వలేరు.

రెండవదిగా, దేవుడు మనకు "తండ్రి." (యెషయా 63:16) ఎలా? ఆయన మనకు ప్రాణాన్ని ఇచ్చాడు. అంతేకాదు, ఒక మంచి తండ్రి తన పిల్లలను చూసుకున్నట్లే దేవుడు మనల్ని ఎప్పుడూ విడిచిపెట్టకుండా శ్రద్ధ చూపిస్తున్నాడు. పూర్వకాలంలో ఎఫ్రాయిము అనే ప్రాంతానికి చెందిన తన ప్రజలతో దేవుడు ఇలా చెప్పాడు: "ఎఫ్రాయిము నా కిష్టమైన కుమారుడా? నాకు ముద్దుబిడ్డా? . . . అతని గూర్చి నా కడుపులో చాలా వేదనగా నున్నది, తప్పక నేనతని కరుణింతును." (యిర్మీయా 31:20) నేడు తన ఆరాధకుల గురించి కూడా దేవునికి అలానే అనిపిస్తుంది. ఆయన మన మహోన్నత సృష్టికర్తయే కాదు మన నమ్మకమైన స్నేహితుడు, తండ్రి. కాబట్టి ఆయన నుండి వచ్చే ఏ బహుమానాన్ని అయినా ఎంతో విలువైనదిగా చూస్తాం. కాదంటారా?



## ఎందుకు ఇచ్చాడు?

బాధ్యతతో కాకుండా నిజమైన ప్రేమతో ఇచ్చిన బహుమానాలకు ఎంతో విలువ ఉంటుంది. ఏ స్వార్థం లేకుండా బహుమానం ఇచ్చినవాళ్లు, వాళ్లు చూపించిన ప్రేమకు బదులుగా ఏదో పొందాలని ఎప్పుడూ ఆశించరు.

దేవుడు మనల్ని ప్రేమించాడు కాబట్టే తన కొడుకుని మనకోసం ఇచ్చాడు. "దేవుడు తన ఒక్కగానొక్క కొడుకును ఈ లోకంలోకి పంపించి మనమీద ***తనకున్న ప్రేమను*** వెల్లడిచేశాడు." ఏ ఉద్దేశంతో దేవుడు అలా చేశాడు? "మనం ఆ కొడుకు ద్వారా జీవం సంపాదించుకునేలా దేవుడు ఆయన్ని పంపించాడు." (1 యోహాను 4:9) అలా పంపించడం తన బాధ్యత కాబట్టి దేవుడు అలా చేశాడా? కానేకాదు! క్రీస్తుయేసు చెల్లించిన విమోచన క్రయధనం దేవుని ***అపారదయకు*** నిదర్శనం. —రోమీయులు 3:24.

"అపారదయ" వల్లే దేవుడు ఆ బహుమానాన్ని ఇచ్చాడని ఎందుకు చెప్పవచ్చు? బైబిలు ఇలా వివరిస్తుంది: "దేవుడు మన పట్ల తన ప్రేమను చూపిస్తున్నాడు. ఎలాగంటే మనం ఇంకా పాపులుగా ఉన్నప్పుడే క్రీస్తు మనకోసం చనిపోయాడు." (రోమీయులు 5:8) బలహీనమైన, నిస్సహాయ స్థితిలో ఉన్న పాపులైన మనుషులకు సహాయం చేయడానికి నిస్వార్థమైన ప్రేమతో దేవుడు ముందుకు వచ్చాడు. ఆ ప్రేమ మనం సంపాదించుకున్నది కాదు లేదా తిరిగి ఇవ్వగలిగింది కాదు. ఆ బహుమానం చరిత్రలోనే నిలిచిపోయే దేవుని గొప్ప ప్రేమకు నిదర్శనం.



## అందుకు ఏమి త్యాగం చేశాడు?

కొన్ని బహుమానాలను మనం ఎంతో అమూల్యంగా చూస్తాం ఎందుకంటే దాన్ని ఇచ్చినవాళ్లు ఎంతో త్యాగం చేసి మనకు ఇచ్చారు. వాళ్లకు ఎంతో విలువైనదాన్ని ఇష్టంగా వదులుకుని మనకు ఇచ్చినప్పుడు మనం ఆ త్యాగాన్ని బట్టి ఆ బహుమానానికి ఎంతో విలువిస్తాం.

దేవుడు ***"తన ఒక్కగానొక్క కొడుకును*** ఇచ్చాడు." (యోహాను 3:16) యేసుకన్నా ఇష్టమైనవాళ్లు యెహోవాకు ఇంకెవ్వరూ లేరు. దేవుడు విశ్వాన్ని సృష్టిస్తున్న కోట్ల సంవత్సరాల్లో యేసు ఆయన పక్కనే పని చేశాడు. దేవుడు ఆయన "మూలంగా ఎంతో ఆనందించాడు." (సామెతలు 8:30) యేసు దేవుని "ప్రియ కుమారుడు," "కనిపించని దేవుని ప్రతిబింబం." (కొలొస్సయులు 1:13-15) ఆలోచన సామర్థ్యం ఉన్న ప్రాణుల్లో ఇంత దగ్గరి బంధం ఇంకెక్కడా కనిపించదు.

అయితే, దేవుడు "తన సొంత కొడుకును మరణానికి అప్పగించడానికి కూడా సిద్ధపడ్డాడు." (రోమీయులు 8:32) అత్యంత విలువైన తన కుమారుణ్ణి యెహోవా మనకు ఇచ్చాడు. ఇంకే బహుమానం విషయంలో దేవుడు ఇంత త్యాగం చేయలేదు.



## గొప్ప అవసరాన్ని తీర్చింది

ఎంతో అవసరమున్న సమయంలో, సరిగ్గా మనకు కావాల్సినవాటిని బహుమానంగా ఇచ్చినప్పుడు మనం వాటిని ఎంతో అమూల్యంగా చూస్తాం. ఉదాహరణకు, ప్రాణాపాయ పరిస్థితిలో అవసరమైన చికిత్స కోసం మీ దగ్గర డబ్బులు లేనప్పుడు ఎవరైనా ముందుకు వచ్చి కావాల్సిన డబ్బులు ఇచ్చారు అనుకోండి. వాళ్లంటే మీకు ఎంత కృతజ్ఞత ఉంటుంది! ఆ బహుమానానికి మీరు వెల కట్టలేరు.

"ఆదాము వల్ల అందరూ చనిపోతున్నట్టే, క్రీస్తు వల్ల ***అందరూ బ్రతికించబడతారు."*** (1 కొరింథీయులు 15:22) ఆదాము నుండి వచ్చినవాళ్లుగా, మనమందరం 'చనిపోతున్నాం,' అనారోగ్యం, మరణం తప్పించుకోలేకపోతున్నాం. దేవునితో సమాధానపడి ఆయన ముందు నిర్దోషులుగా ఉండలేకపోతున్నాం. మనం కేవలం మనుషులమే కాబట్టి మనల్ని మనం బ్రతికించుకోలేము లేదా వేరే వాళ్లని బ్రతికించలేము. బైబిలు ఇలా చెప్తుంది: "ఎవడును ఏ విధముచేతనైనను తన సహోదరుని విమోచింపలేడు . . . అది ఎన్నటికిని తీరక అట్లుండవలసినదే." (కీర్తన 49:7-9) మనకు సహాయం ఎంతో అవసరం ఎందుకంటే విమోచించడానికి కావాల్సిన విలువ పెట్టుకోలేని దీనస్థితిలో మనం ఉన్నాం. అలానే వదిలేస్తే, మనం నిస్సహాయులుగా మిగిలిపోతాం.

ఆయన గొప్ప ప్రేమ వల్ల యెహోవా ఇష్టంగా ముందుకొచ్చి మనల్ని ప్రాణాపాయ స్థితి నుండి కాపాడడానికి అవసరమయ్యే "చికిత్స" కోసం వెలను చెల్లించాడు. అప్పుడు యేసు ద్వారా "అందరూ బ్రతికించబడతారు." విమోచన క్రయధనం దీనంతటిని ఎలా సాధ్యం చేస్తుంది? "ఆయన కొడుకైన యేసు రక్తం మన పాపాలన్నిటినీ కడిగివేస్తుంది." యేసు చిందించిన రక్తం మీద విశ్వాసం

ఉంటే పాపక్షమాపణ, శాశ్వత జీవితం పొందుతాం. (1 యోహాను 1:7; 5:13) విమోచన క్రయధనం వల్ల చనిపోయిన మన ప్రియమైనవాళ్లకు ఏమైనా ప్రయోజనం ఉందా? “మరణం ఎలాగైతే ఒక మనిషి ద్వారా వచ్చిందో, అలాగే మృతుల పునరుత్థానం కూడా ఒక మనిషి [యేసు] ద్వారానే కలుగుతుంది.”—1 కొరింథీయులు 15:21.*

బహుమానాల్లో ఇదే అన్నిటికన్నా గొప్పది ఎందుకంటే బహుమానాలు ఇచ్చేవాళ్లలో దేవుని కన్నా గొప్పవాళ్లు ఎవరూ లేరు. యేసు బలిని ఏర్పాటు చేసిన దేవుని ప్రేమకు కూడా ఏది సాటి రాదు. మనకోసం యెహోవా దేవుడు చేసినంత త్యాగం ఎవ్వరూ, ఎప్పుడూ చేయలేదు. మనల్ని పాపం, మరణం నుండి విడిపించే ఆ త్యాగం కన్నా మన అవసరాలను తీర్చే బహుమానం ఇంకేది లేదు. విమోచన క్రయధనానికి ఉన్న విలువను దేనితో పోల్చలేము, దానికి సాటియైన బహుమానం ఏదీ ఉండదు.

* చనిపోయినవాళ్లను మళ్లీ బ్రతికించే దేవుని ఉద్దేశం గురించి ఇంకా తెలుసుకోవాలంటే యెహోవాసాక్షులు ప్రచురించిన *బైబిలు నిజంగా ఏమి బోధిస్తోంది?* పుస్తకంలో 7వ అధ్యాయం చూడండి. www.jw.org\te వెబ్‌సైట్‌లో ఈ పుస్తకం ఉంటుంది.



యేసు చేసిన త్యాగం గురించి, దానివల్ల మీకు వచ్చే ప్రయోజనాల గురించి ఇంకా తెలుసుకోవాలంటే www.jw.org/te వెబ్‌సైట్‌లో యేసు మరణాన్ని జ్ఞాపకం చేసుకోండి అనే చిన్న వీడియో చూడండి. ప్రచురణలు > వీడియోలు చూడండి. మీ మొబైల్‌తో ఈ కోడ్ స్కాన్ చేసి చూడవచ్చు.

# దేవుడు ఇచ్చిన అత్యంత గొప్ప బహుమానానికి మీరు ఎలా స్పందిస్తారు?

*‘క్రీస్తు ప్రేమ మమ్మల్ని బలంగా పురికొల్పుతోంది . . . బ్రతికి ఉన్నవాళ్లు ఇకమీదట తమకోసం జీవించకుండా, తమకోసం చనిపోయి బ్రతికించబడిన వ్యక్తి కోసం జీవించాలి.’—2 కొరింథీయులు 5:14, 15.*

**ఒక గొప్ప** బహుమానానికి మనం ఖచ్చితంగా కృతజ్ఞత చూపించాలి. ఆ విషయంలో యేసు ఒక పాఠం నేర్పించాడు. ఆ కాలంలో చికిత్సలేని జబ్బుతో బాధపడుతున్న పదిమందిని యేసు బాగుచేశాడు. ఆ పదిమందిలో ఒకరు మాత్రమే “దేవుణ్ణి బిగ్గరగా మహిమపరుస్తూ వెనక్కి తిరిగొచ్చాడు.” అప్పుడు యేసు ఇలా అడిగాడు: “పదిమందీ శుద్ధులయ్యారు కదా? మరి మిగతా తొమ్మిదిమంది ఎక్కడ?” (లూకా 17:12-17) ఇందులో పాఠం ఏమిటి? వేరేవాళ్లు మనకు ఏదైన మంచి చేస్తే మనం దాన్ని తొందరగా మర్చిపోయే అవకాశం ఉంది.

విమోచన క్రయధనం వేరే బహుమానాల్లా కాదు. ఇలాంటి బహుమానాన్ని ఎవరూ ఎప్పుడూ ఇవ్వలేదు. మరి, దేవుడు మన కోసం చేసిన ఈ ఏర్పాటుకు మనం ఎలా ప్రతిస్పందించాలి?

***బహుమానం ఇచ్చిన దేవుని గురించి తెలుసుకోండి.*** విమోచన క్రయధనం ఉన్నంతమాత్రాన ఏమి చేయకుండానే నిత్యజీవం రాదు. యేసు ప్రార్థిస్తున్నప్పుడు దేవునితో ఇలా చెప్పాడు: “ఒకే ఒక్క సత్య దేవుడివైన నిన్నూ, నువ్వు పంపించిన యేసుక్రీస్తునూ **తెలుసుకోవడమే** శాశ్వత జీవితం.” (యోహాను 17:3) చిన్నప్పుడు మీ ప్రాణాన్ని ఒకతను కాపాడాడు అని మీకు ఎవరైనా చెప్తే,

అతని గురించి మీరు ఇంకా తెలుసుకోరా? మిమ్మల్ని ఎందుకు కాపాడాడో తెలుసుకోరా? మీ ప్రాణాలను కాపాడే బహుమానాన్ని ఇచ్చిన యెహోవా దేవుడు, తన గురించి మీరు తెలుసుకోవాలని కోరుకుంటున్నాడు. అంతేకాదు ఆయనతో మీకు ఒక దగ్గరి సంబంధం ఉండాలని కూడా కోరుకుంటున్నాడు. “దేవునికి దగ్గరవ్వండి, అప్పుడు ఆయన మీకు దగ్గరౌతాడు” అని బైబిలు చెప్తుంది.—యాకోబు 4:8.

***విమోచన క్రయధనం మీద విశ్వాసం చూపించండి.*** “కొడుకు మీద విశ్వాసం చూపించే వ్యక్తి శాశ్వత జీవితం పొందుతాడు.” (యోహాను 3:36) విశ్వాసం చూపించడం ఎలా? క్రియల్లో. విమోచన క్రయధనం మీద విశ్వాసం చూపించడానికి క్రియలు అవసరం. (యాకోబు 2:17) ఎలాంటి క్రియలు? మీరు ముందుకొచ్చి తీసుకుంటేనే బహుమానం మీ సొంతం అవుతుంది. అలానే విమోచన క్రయధనాన్ని మీరు ముందుకొచ్చి తీసుకోవాలి. ఎలా? మీరు ఎలా జీవించాలని దేవుడు కోరుతున్నాడో నేర్చుకుని అలా జీవించండి.* క్షమాపణ కోసం, స్వచ్ఛమైన మనస్సాక్షి కోసం దేవునికి ప్రార్థన చేయండి. విమోచన క్రయధనం మీద విశ్వాసం చూపించేవాళ్లందరికీ శాంతి, భద్రత, సమృద్ధి ఉన్న నిత్య భవిష్యత్తు ఇచ్చితంగా ఉంటుందనే బలమైన నమ్మకంతో దేవునికి ప్రార్థించండి. —హెబ్రీయులు 11:1.

***యేసు మరణ జ్ఞాపకార్థ ఆచరణకు హాజరవ్వండి.*** విమోచన క్రయధన ఏర్పాటును మనం గుర్తుంచుకోవడానికి సంవత్సరానికి ఒకసారి చేసే ఒక ఆచరణను యేసు స్థాపించాడు. ఆ ఆచరణ గురించి యేసు ఇలా చెప్పాడు: “నన్ను గుర్తుచేసుకోవడానికి దీన్ని చేస్తూ ఉండండి.” (లూకా 22:19) యెహోవాసాక్షులు **మంగళవారం, ఏప్రిల్ 11, 2017**న సూర్యాస్తమయం తర్వాత యేసు మరణాన్ని గుర్తు చేసుకుంటారు. ఆ కార్యక్రమం దాదాపు గంటసేపు ఉంటుంది. అందులో యేసు మరణానికి ఉన్న ప్రాముఖ్యత గురించి, దానివల్ల ఇప్పుడూ, భవిష్యత్తులో వచ్చే ప్రయోజనాల గురించి వివరించే ప్రసంగం ఉంటుంది. పోయిన సంవత్సరం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2 కోట్ల మంది యేసు మరణ జ్ఞాపకార్థానికి వచ్చారు. దేవుడు ఇచ్చిన అత్యంత గొప్ప బహుమానానికి ప్రతిస్పందిస్తూ ఈ కార్యక్రమానికి మాతోపాటు హాజరవ్వమని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము. ■

* దేవుని గురించి తెలుసుకుని, ఆయనకు దగ్గరవ్వడానికి ఆయన వాక్యాన్ని అధ్యయనం చేయడం చాలా అవసరం. దీన్ని ఎలా చేయాలో తెలుసుకోవాలంటే యెహోవాసాక్షులను అడగండి లేదా మా వెబ్‌సైట్ www.jw.org చూడండి.







# క్రైస్తవ మతగురువులు పెళ్లికి, లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలా?

**మత నాయకులు,** గురువులు పెళ్లికి, లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలనే నియమం ప్రపంచంలో చాలా మతాల్లో ఉంది. రోమన్ క్యాథలిక్ చర్చీలు, వేర్వేరు ఆర్థొడాక్స్ చర్చీలు, బౌద్ధులు ఇంకా వేరే మతస్థులు ఈ నియమాన్ని పాటిస్తున్నారు. కానీ, ఇటీవల కాలంలో వేర్వేరు మతాల్లో ఉన్న మత గురువుల లైంగిక అరాచకాలు ఎక్కువయ్యాయి. అందుకు ముఖ్య కారణం ఈ నియమమే అని చాలామంది ప్రజలు అనుకుంటున్నారు.

కాబట్టి ముందుగా మనం, క్రైస్తవమత గురువులు పెళ్లి చేసుకోకుండా ఉండాలనే నియమం బైబిల్లో ఉందో లేదో తెలుసుకోవడం మంచిది. అలా తెలుసుకోవడానికి ఈ నియమం ఎలా మొదలైంది? ఎలా వ్యాపించింది? దీని గురించి దేవుని అభిప్రాయం ఏంటి? లాంటి విషయాలు గమనిద్దాం.

## బ్రహ్మచర్యం గురించి మత చరిత్ర

ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా బ్రహ్మచర్యం గురించి ఇలా నిర్వచిస్తుంది: పెళ్లి చేసుకోకుండా ఉండి లైంగిక సంబంధాలకు దూరంగా ఉండే స్థితి, సాధారణంగా ఈ పదాన్ని మత అధికారి లేదా భక్తుడికి వాడతారు. "అపొస్తలులు చనిపోయిన కొంతకాలానికి బ్రహ్మచర్యం ఒక ఆచారంగా మొదలైంది" అని 2006లో రోమన్ క్యూరియా ఎదుట ఇచ్చిన ప్రసంగంలో పోప్ బెనడిక్ట్ XVI చెప్పాడు.

కానీ అపొస్తలులు ఉన్న మొదటి శతాబ్దంలో క్రైస్తవులు బ్రహ్మచర్యాన్ని ఒక మతాచారంగా పాటించలేదు. అంతేకాదు "దేవుని నుండి వచ్చాయనిపించే మోసపూరిత సందేశాల్ని" చెప్పేవాళ్లు, 'పెళ్లిని నిషేధించే' వాళ్లు వస్తారని ఆ కాలంలో జీవించిన అపొస్తలుడైన పౌలు ముందుగానే విశ్వాసులతో చెప్పాడు.—1 తిమోతి 4:1-3.

రెండవ శతాబ్దంలో బ్రహ్మచర్యమనే ఆచారం కొన్ని ప్రాచ్య "క్రైస్తవ" చర్చీల్లో మొదలైంది. ఆ చర్చీలే తర్వాత రోమన్ క్యాథలిక్ మతంగా ఏర్పడ్డాయి. ఇది "లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలని రోమా సామ్రాజ్యంలో వచ్చిన కొత్త పోకడకు అనుకూలంగా ఉంది" అని సెలిబసి అండ్ రిలీజియస్ ట్రెడిషన్స్, (*Celibacy and Religious Traditions*) అనే పుస్తకం చెప్తుంది.

యేసు, పేతురు అత్తను కలిసి ఆమెను బాగుచేశాడు.—మత్తయి 8:14, 15; మార్కు 1:29-31



తర్వాత శతాబ్దాల్లో చర్చి సమితీలు, చర్చి ఫాదర్లు అని చెప్పుకునేవాళ్లు మతగురువుల బ్రహ్మచర్యాన్ని ప్రోత్సహించారు. లైంగిక సంబంధాలు అశుద్ధమని, చర్చి బాధ్యతలున్న మత గురువులకు తగదని వాళ్లు భావించారు. అయితే, ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా "10వ శతాబ్దం వరకు చాలామంది ప్రీస్టులకు, కొంతమంది బిషప్‌లకు కూడా భార్యలు ఉన్నారని" సూటిగా చెప్తుంది.

చర్చి ఫాదర్లు ఖచ్చితంగా బ్రహ్మచారులుగా ఉండాలనే నియమాన్ని రోములో 1123, 1139 సంవత్సరాల్లో జరిగిన లాటరన్ సమితీలు అమలులోకి తెచ్చాయి. నేటి వరకు రోమన్ క్యాథలిక్ చర్చి అదే నియమం పాటిస్తుంది. ఈ నియమం ద్వారా పెళ్లైన ప్రీస్టులు చర్చి ఆస్తిని వాళ్ల పిల్లలకు రాసి ఇవ్వడంతో కలిగే అధికార నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని ఆపగలిగారు.

## బ్రహ్మచర్యం విషయంలో దేవుని అభిప్రాయం

బ్రహ్మచర్యం గురించి దేవుని అభిప్రాయం ఆయన వాక్యమైన బైబిల్లో స్పష్టంగా ఉంది. తనలానే "పరలోక రాజ్యం కోసం" పెళ్లి చేసుకోకుండా ఉన్న వాళ్ల గురించి యేసు చెప్పిన మాటలను మనం అక్కడ చదవవచ్చు. (మత్తయి 19:12) ఈ విషయంలో అపొస్తలుడైన పౌలు కూడా "మంచివార్త కోసం" తనలా ఒంటరిగా ఉండాలని నిర్ణయించుకున్న వాళ్ల గురించి రాశాడు.—1 కొరింథీయులు 7:37, 38; 9:23.

కానీ, దేవుని సేవకులు పెళ్లికి దూరంగా ఉండాలని యేసుగానీ, పౌలుగానీ ఆజ్ఞ ఇవ్వలేదు. ఒంటరిగా ఉండడం ఒక "బహుమానం" అని చెప్తూ అది తన అనుచరులందరికీ ఉండదని యేసు చెప్పాడు. పౌలు "పెళ్లికానివాళ్ల" గురించి రాస్తూ "ప్రభువు నాకు ఏ ఆజ్ఞా ఇవ్వలేదు . . . నేను నా అభిప్రాయం చెప్తున్నాను" అని నిజాయితీగా ఒప్పుకున్నాడు.—మత్తయి 19:11; 1 కొరింథీయులు 7:25.

అంతేకాదు, మొదటి శతాబ్దంలో ఉన్న చాలామంది క్రైస్తవ సేవకులు, అపొస్తలుడైన పేతురు కూడా పెళ్లిచేసుకున్నవాళ్లే అని బైబిల్లో ఉంది. (మత్తయి 8:14; మార్కు 1:29-31; 1 కొరింథీయులు 9:5) నిజానికి ఆ రోజుల్లో రోమా సామ్రాజ్యంలో లైంగిక అనైతిక ఎక్కువగా ఉంది. అందుకే, పెళ్లైన క్రైస్తవ పర్యవేక్షకుడి గురించి రాస్తూ "అతనికి ఒకే భార్య ఉండాలి" అని, అతని పిల్లలు అతనికి 'లోబడి' ఉండేలా చూసుకోవాలని పౌలు అన్నాడు.—1 తిమోతి 3:2, 4.

వీళ్లంతా పెళ్లి చేసుకుని లైంగిక సంబంధాలకు దూరంగా ఉన్న వాళ్లు కాదు. ఎందుకంటే, బైబిలు "భర్త తన భార్య అవసరాన్ని తీర్చాలి," పెళ్లి చేసుకున్నవాళ్లు లైంగిక సాన్నిహిత్యం లేకుండా "ఒకరికి ఒకరు దూరంగా ఉండకూడదు" అని చెప్తుంది. (1 కొరింథీయులు 7:3-5) సూటిగా చెప్పాలంటే, లైంగిక సంబంధాలను దేవుడు నిషేధించట్లేదు, క్రైస్తవ సేవకులు బ్రహ్మచర్యాన్ని పాటించాలనే ఖచ్చితమైన నియమం ఎక్కడ లేదు.

## మంచివార్త కోసం

దేవుని సేవకులు ఖచ్చితంగా బ్రహ్మచారులుగా ఉండాలనే నియమం లేనప్పుడు యేసు, పౌలు పెళ్లి చేసుకోకుండా ఉండడం మంచిదని ఎందుకు చెప్పారు? ఎందుకంటే, పెళ్లికాని వాళ్లకు మంచివార్తను ఇతరులకు చెప్పే అవకాశాలు ఎన్నో ఉంటాయి. పెళ్లి చేసుకున్న వాళ్లకు ఉండే ఆందోళనలు పెళ్లి కాని వాళ్లకు ఉండవు కాబట్టి ఎక్కువ సేవ చేయగలుగుతారు.—1 కొరింథీయులు 7:32-35.

డావీడ్ ఉదాహరణ పరిశీలించండి, బైబిలు గురించి ప్రజలకు చెప్పడానికి మెక్సికో సిటీలో మంచి జీతం ఉన్న ఉద్యోగాన్ని వదిలి కోస్టరికాలో ఉన్న చిన్న గ్రామానికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అతను పెళ్లి చేసుకోలేదు కాబట్టి ఆ పనిని సులువుగా చేయగలిగాడా? "ఖచ్చితంగా," అని అతను చెప్తున్నాడు. "కొత్త సంస్కృతికి, కొత్త జీవన విధానానికి అలవాటు పడడం కష్టంగానే ఉంది, కాని నేను ఒక్కడినే ఉన్నాను కాబట్టి అలవాటు చేసుకోవడానికి ఎక్కువ కష్టంగా అనిపించలేదు."

> "అది పెద్ద విషయమేమీ కాదు. మీకు పెళ్లైనా కాకపోయినా యెహోవాకు మీ శ్రేష్ఠమైనది ఇస్తే సంతోషంగా ఉంటారు."—క్లౌడియా

సువార్తికుల అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లిన క్లౌడియా ఇలా అంటుంది: "దేవుని సేవను నేను ఆనందిస్తున్నాను. ఆయన నా మీద ఎలా శ్రద్ధ చూపిస్తున్నాడో చూసి నా విశ్వాసం, దేవునితో నాకున్న సంబంధం బలపడింది."

పెళ్లిచేసుకోకుండా ఉండడం భారంగా ఉంటుందని అనుకోవడానికి లేదు. క్లౌడియా ఇంకా ఇలా అంటుంది: "అది పెద్ద విషయమేమీ కాదు. మీకు పెళ్లైనా కాకపోయినా యెహోవాకు మీ శ్రేష్ఠమైనది ఇస్తే సంతోషంగా ఉంటారు."—కీర్తన 119:1, 2.■



పూర్వం ఐగుప్తులో బంధించిన బానిసలను చూపిస్తున్న చిత్రం



ఆఫ్రికా అమెరికాల మధ్య జరిగిన బానిసల వ్యాపారం చాలా లాభాలు తెచ్చేది

# బానిసత్వం నుండి విడుదల అప్పుడు, ఇప్పుడు

అల్క* అనే అమ్మాయికి బ్యూటీపార్లర్‌లో పని ఇప్పిస్తామని ఎవరో ఆమెను యూరప్‌కు తెచ్చారు. తర్వాత వాళ్లు, ఆమెను పదిరోజులపాటు కొడుతూ, ఇంటిదగ్గరున్న కుటుంబ సభ్యులను హింసిస్తామని బెదిరిస్తూ, బలవంతంగా వేశ్యావృత్తిలోకి దించారు.

అల్క, ఆ వేశ్యాగృహం యజమానురాలికి ఇవ్వాల్సిన 40,000 యూరోల అప్పు తీర్చడానికి, ఒక్క రాత్రికి 200 నుండి 300 యూరోల డబ్బు సంపాదించాల్సి ఉంది.# "నేను చాలాసార్లు పారిపోవాలని అనుకున్నాను, కానీ నా కుటుంబాన్ని ఏం చేస్తారో అని భయపడేదాన్ని. నాకు బయటపడే దారి లేకుండా చేశారు" అని అల్క అంటుంది. అంతర్జాతీయంగా జరుగుతున్న సెక్స్ బిజినెస్ వల్ల బలైపోయిన దాదాపు 40 లక్షల మంది కథల్లో ఆమెది ఒకటి.

సుమారు 4000 సంవత్సరాల క్రితం యోసేపు అనే యువకుడిని అతని అన్నలు అమ్మేశారు. తర్వాత అతను బాగా పేరున్న ఒక ఐగుప్తీయుని ఇంట్లో బానిస అయ్యాడు. అల్కలా యోసేపును ముందు నుండే యజమాని హింసించలేదు. కానీ యజమాని భార్య యోసేపును లోపర్చుకోవాలని చేసిన ప్రయత్నాలను అతను తిప్పి కొట్టినప్పుడు తనను బలాత్కారం చేయబోయాడని అన్యాయంగా నింద వేసింది. అప్పుడు అతనిని జైల్లో పడేసి, సంకెళ్లు వేశారు.—ఆదికాండము 39:1-20; కీర్తన 105:17, 18.

యోసేపు పూర్వకాలంలో ఉన్న బానిస. అల్క 21వ శతాబ్దంలో ఉన్న బానిస. కానీ అనాదిగా మనుషులతో చేస్తున్న వ్యాపారాలకు ఇద్దరూ బలి అయిన వాళ్లే. ఈ వ్యాపారంలో మనుషుల్ని వస్తువుల్లా చూస్తారు, డబ్బు సంపాదించడం తప్ప వేరే ఏదీ పట్టించుకోరు.

## యుద్ధం వల్ల బానిస వ్యాపారం చాలా పెరుగుతుంది

బానిసల్ని సంపాదించుకోవడానికి కొన్ని దేశాలకు యుద్ధం సులువైన మార్గం. ఐగుప్తు రాజైన తుత్‌మోస్ III కనానులో చేసిన ఒక యుద్ధం తర్వాత దాదాపు 90,000 మందిని బానిసలుగా తెచ్చుకున్నాడని చెప్తారు. వాళ్లను గనుల్లో పనిచేయడానికి, గుళ్లు కట్టడానికి, కాలువలు త్రవ్వించడానికి ఐగుప్తీయులు వాడుకునేవాళ్లు.

* అసలు పేరు కాదు.

# అంటే అల్క ఒక్కో రాత్రి కనీసం 14,000 నుండి 21,000 రూపాయలు సంపాదించి, దాదాపు 29,00,000 రూపాయల అప్పు తీర్చాల్సి ఉంది.





లక్షలమంది ఇంకా బానిసలుగా వెట్టిచాకిరి చేస్తున్నారు

Image © PRILL/Shutterstock; The Old Print Shop/Kenneth M. Newman; UN PHOTO/Jean Pierre Laffont

రోమా సామ్రాజ్యంలో కూడా యుద్ధాల వల్ల పుష్కలంగా బానిసలు దొరికేవాళ్లు. కొన్నిసార్లు బానిసల్ని సంపాదించుకోవడం కోసమే యుద్ధాలు చేసేవాళ్లు. మొదటి శతాబ్దం వచ్చే సరికి రోములో దాదాపు సగం జనాభా బానిసలే ఉండి ఉంటారని అంచనా. చాలామంది ఐగుప్తీయులు, రోమీయులు బానిసల్ని ఘోరంగా హింసించి చాకిరి చేయించేవాళ్లు. రోమా గనుల్లో పని చేసే బానిసల జీవితకాలం చాలా తక్కువ. 30 సంవత్సరాలకన్నా ఎక్కువ బ్రతికేవాళ్లు కాదు.

కాలం గడిచే కొద్దీ బానిసల జీవితం తేలిక కాలేదు. 16వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకు, ఆఫ్రికా అమెరికాల మధ్య జరిగిన బానిసల వ్యాపారం మిగతా వ్యాపారాల కన్నా చాలా లాభాలు తెచ్చింది. 'దాదాపు 250 నుండి 300 లక్షల పురుషుల్ని, స్త్రీలని, పిల్లల్ని బలవంతంగా తీసుకెళ్లి అమ్మేసేవాళ్లు' అని UNESCO రిపోర్టు చెప్తుంది. అట్లాంటిక్ సముద్రం దాటుతూ కొన్ని లక్షల మంది చనిపోయి ఉంటారని చెప్తారు. అప్పుడు ప్రాణాలతో బయటపడిన ఓలౌడా ఇక్వియానో అనే ఒక బానిస ఇలా చెప్తున్నాడు: "స్త్రీల ఆర్తనాదాలతో, చనిపోయే వాళ్ల మూలుగులతో ఆ దృశ్యం చెప్పలేనంత భయంకరంగా ఉంది."

బానిసత్వం చరిత్రలో ఎప్పుడో అంతమైపోయిన విషాద గాథ కాదు. దాదాపు 210 లక్షల స్త్రీపురుషులు, పిల్లలు ఇంకా బానిసలుగా వెట్టిచాకిరి చేస్తున్నారు. వాళ్లకు చాలా తక్కువ డబ్బులు ఇస్తారు లేదా అసలు ఇవ్వరు అని అంతర్జాతీయ కార్మిక సంస్థ చెప్తుంది. ఇప్పుడున్న బానిసలు గనుల్లో, నేత పరిశ్రమల్లో, ఇటుకల ఫ్యాక్టరీల్లో, బ్రోతల్ గృహాల్లో, ఇళ్లల్లో పని చేస్తారు. చట్ట విరుద్ధం అయినప్పటికీ, ఇలాంటి బానిసత్వం చాలా ఎక్కువైపోతుంది.

## స్వేచ్ఛ కోసం పోరాటం

క్రూరమైన అణచివేత వల్ల చాలామంది బానిసలు స్వేచ్ఛ కోసం పోరాడారు. క్రీ.పూ. మొదటి శతాబ్దంలో స్పార్టకస్ అనే గ్లాడియేటర్‌తో పాటు దాదాపు 1,00,000 మంది బానిసలు కలిసి రోముకు వ్యతిరేకంగా తిరగబడ్డారు గానీ గెలవలేకపోయారు. 18వ శతాబ్దంలో, కరీబియన్ దీవి అయిన హిస్పానోలాలో బానిసలు యజమానులకు వ్యతిరేకంగా లేచారు. చెరుకు తోటల్లో పని చేసే బానిసలతో ఘోరంగా వ్యవహరించడం వల్ల 13 సంవత్సరాలు అంతర్యుద్ధం జరిగింది. దాని ఫలితంగా 1804లో హాయిటీ స్వతంత్ర దేశంగా ఏర్పడింది.

ఇశ్రాయేలీయులకు, ఐగుప్తు నుండి వచ్చిన విడుదల చరిత్రలోనే బానిసత్వం నుండి వచ్చిన అతి విజయవంతమైన విడుదల అని చెప్పవచ్చు. బహుశా 30 లక్షల ప్రజలు, అంటే ఒక పూర్తి దేశం, ఐగుప్తు బానిసత్వం నుండి విడుదల పొందారు. వాళ్లు ఆ స్వేచ్ఛకు నిజంగా అర్హులు. ఎందుకంటే ఐగుప్తులో వాళ్ల జీవితం గురించి బైబిలు ఇలా చెప్తుంది, "వారు ఇశ్రాయేలీయులచేత చేయించుకొనిన ప్రతి పనియు కఠినముగా ఉండెను." (నిర్గమ కాండము 1:11-14) ఇశ్రాయేలీయుల జనాభా పెరగకుండా

## మరో రకమైన బానిసత్వం నుండి విడుదల



ఆలోన్సో ఒక రకమైన బానిస. టీనేజర్‌గానే కొకైన్, హెరాయిన్‌కు బానిస అయ్యాడు. ఆయన ఇలా ఒప్పుకుంటున్నాడు, "మాదక ద్రవ్యాలు కొనుక్కోవడానికి డబ్బు కోసం నేను నేరాలు చేస్తూ మాదకద్రవ్యాల వ్యాపారం చేశాను. మాదకద్రవ్యాల అలవాటు నుండి బయటపడడానికి చికిత్స కోసం నాలుగుసార్లు డీటాక్సిఫికేషన్ సెంటర్లకు వెళ్లాను. కానీ ఆ అలవాటును మానుకోలేకపోయాను. చివరికి పోలీసులకు దొరికిపోయి నాలుగు సంవత్సరాలు జైల్లో ఉన్నాను."

ముప్పై సంవత్సరాలు డగ్స్‌కు బానిసగా ఉన్నాక, ఆలోన్సో యెహోవాసాక్షుల దగ్గర బైబిలు నేర్చుకోవడం మొదలు పెట్టాడు. బైబిలు విషయాలు అతని హృదయాన్ని తాకినప్పుడు, ఆ బానిసత్వం నుండి బయటపడాలని నిర్ణయించుకున్నాడు. ఆలోన్సో ఇలా అంటున్నాడు, "చాలా సంవత్సరాలు నాకు చాలా కష్టం అయ్యింది. కానీ ఆ పోరాటంలో గెలవడానికి యెహోవా దేవుడు నాకు సహాయం చేశాడు."—కీర్తన 55:22.

"నేను ఇంతగా మారడం చూసి నా భార్య చాలా సంతోషించింది. నన్ను నేను నాశనం చేసుకునే మార్గం నుండి బయట పడడానికి యెహోవా నాకు సహాయం చేశాడు. ఆయన సహాయం లేకపోతే నేను ఇంకా ఈ అలవాటుకు బానిసగా ఉండేవాడిని, లేదా చనిపోయి ఉండేవాడిని" అని ఆలోన్సో అంటున్నాడు.

చేయడానికి ఒక ఫరో దేశంలో వాళ్ల చంటి పిల్లలందరినీ చంపించాలని ఆజ్ఞ ఇచ్చాడు.—నిర్గమకాండము 1:8-22.

ఐగుప్తులో ఇశ్రాయేలీయులకు జరిగిన అన్యాయం నుండి వాళ్లకు వచ్చిన విడుదల చాలా ప్రత్యేకమైంది. ఎందుకంటే దానికి కారణం దేవుడు. "వారి దుఃఖములు నాకు తెలిసే యున్నవి," 'వారిని విడిపించుటకు . . . దిగివచ్చి యున్నాను' అని దేవుడు మోషేతో అన్నాడు. (నిర్గమకాండము 3:7, 8) ఈ రోజు వరకు, యూదులు అన్నిచోట్ల ఆ విడుదలను గుర్తు చేసుకోవడానికి ప్రతి సంవత్సరం పస్కా అనే పండుగను చేస్తారు.—నిర్గమకాండము 12:14.

### బానిసత్వాన్ని పూర్తిగా నిర్మూలించడం

"మన దేవుడైన యెహోవాయందు దౌష్ట్యములేదు" అని బైబిలు చెప్తుంది. అంతేకాదు దేవుడు మారలేదు అనే అభయాన్ని కూడా ఇస్తుంది. (2 దినవృత్తాంతములు 19:7; మలాకీ 3:6) "బందీలకు విడుదల కలుగుతుందని . . . ప్రకటించడానికి; అణచివేయబడిన వాళ్లను విడిపించడానికి" దేవుడు యేసును పంపించాడు. (లూకా 4:18) అంటే ప్రతి బానిసకు స్వాతంత్ర్యం దొరుకుతుందని దాని అర్థమా? కాదు. యేసు ప్రజలను పాపం, మరణం అనే బానిసత్వం నుండి విడిపించడానికి వచ్చాడు. ఆయన తర్వాత ఇలా ప్రకటించాడు, "ఆ సత్యం మిమ్మల్ని విడుదల చేస్తుంది." (యోహాను 8:32) ఈ రోజు కూడా యేసు నేర్పించిన సత్యం ప్రజలను చాలా విధాలుగా విడుదల చేస్తుంది.—"మరో రకమైన బానిసత్వం నుండి విడుదల" అనే బాక్సు చూడండి.

నిజంగా బానిసత్వం నుండి తప్పించుకోవడానికి దేవుడు యోసేపుకు, అల్కకు వేర్వేరు విధాలుగా సహాయం చేశాడు. యోసేపు అసాధారణ కథను మీరు బైబిలు పుస్తకమైన ఆదికాండము 39 నుండి 41 అధ్యాయాల్లో చూడవచ్చు. స్వేచ్ఛ కోసం అల్క చేసిన ప్రయత్నం కూడా అసాధారణమైనది.

యూరప్‌లో ఆమె ఉన్న దేశం నుండి బయటకు పంపించబడ్డాక అల్క స్పెయిన్‌కు వెళ్లింది. అక్కడ ఆమె యెహోవాసాక్షులను కలుసుకుని వాళ్ల దగ్గర బైబిలు నేర్చుకోవడం మొదలు పెట్టింది. ఆమె జీవితాన్ని సరిచేసుకోవాలని నిశ్చయించుకుని, ఒక మంచి ఉద్యోగం చూసుకుంది. ఆమె యజమానురాలికి నెలనెలా ఇవ్వాల్సిన డబ్బుల్ని కాస్త తగ్గించేలా ఒప్పించుకుంది. ఒక రోజు అల్కకు ఆమె యజమానురాలి నుండి ఫోన్ వచ్చింది. ఆమె అల్క ఇవ్వాల్సిన అప్పును మాఫీ చేసి క్షమాపణ అడిగింది. అలా ఎలా జరిగింది? ఆమె కూడా యెహోవాసాక్షుల దగ్గర బైబిలు నేర్చుకోవడం మొదలు పెట్టింది. "సత్యం ఎన్నో అద్భుత రీతుల్లో మనల్ని విడుదల చేస్తుంది" అని అల్క అంటుంది.

యెహోవా దేవుడు ఐగుప్తులో ఇశ్రాయేలీయుల మీద జరిగే దౌర్జన్యాన్ని చూసి చాలా బాధపడ్డాడు. ఈ రోజుల్లో జరిగే అన్యాయాలను చూసి కూడా ఆయన అలానే బాధ పడాలి కదా. అన్ని రకాల బానిసత్వాన్ని తీసేయాలంటే మానవ సమాజంలో చాలా పెద్ద మార్పే రావాలి. దేవుడు అలాంటి మార్పును తీసుకువస్తానని మాట ఇస్తున్నాడు. "అయితే మనం ఆయన చేసిన వాగ్దానాన్ని బట్టి కొత్త ఆకాశం కోసం, కొత్త భూమి కోసం ఎదురుచూస్తున్నాం; వాటిలో ఎప్పుడూ నీతి ఉంటుంది."—2 పేతురు 3:13 ■

# ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని రుచి చూడండి



“బస్సు బయలుదేరవచ్చు, కానీ చైనీస్ అతను ఇక్కడే ఉండాలి!” అలెగ్జాంద్రా బస్సులో కూర్చుని ఆ మాటలు వింది. ఆ బస్సు దక్షిణ అమెరికాలో రెండు దేశాల మధ్య సరిహద్దును దాటడానికి సిద్ధంగా ఉంది. ఏం జరుగుతుందో చూద్దామని ఆమె బస్సు దిగింది. ఆ చైనీస్ యువకుడు వచ్చీరాని స్పానిష్ భాషలో బార్డర్ దగ్గర ఉన్న గార్డుకు ఆయన పరిస్థితి వివరించడానికి అవస్థ పడుతున్నాడు. అలెగ్జాంద్రా యెహోవాసాక్షుల చైనీస్ భాష మీటింగ్స్‌కు వెళ్లేది కాబట్టి ఆ భాషలో మాట్లాడి అతనికి సహాయం చేయడానికి ముందుకు వచ్చింది.

చట్టపరంగా ఇక్కడ ఉండడానికి తనకు అర్హత ఉందని, కానీ అతని డాక్యుమెంట్లను, డబ్బును ఎవరో దోచుకున్నారని ఆ యువకుడు చెప్పాడు. మొదట్లో అధికారి ఆయన చెప్పే విషయాన్ని నమ్మలేదు, అలెగ్జాంద్రా కూడా మనుషులను అమ్మే వ్యాపారం చేస్తుందని అనుమానించాడు. చివరికి, ఆ యువకుడు చెప్పే విషయాన్ని అధికారి నమ్మాడు, అయితే సరైన డాక్యుమెంట్లు లేనందుకు అతను ఫైన్ కట్టాల్సి వచ్చింది. అతని దగ్గర డబ్బులు లేకపోవడంతో అలెగ్జాంద్రా అతనికి 20 డాలర్లు ఇచ్చింది. అతను చాలా కృతజ్ఞతతో 20 కన్నా ఎక్కువ డాలర్లు ఇస్తానని చెప్పాడు. అప్పుడు అలెగ్జాంద్రా ఏదో ఆశించి సహాయం చేయలేదని, అలా చేయడం సరైనదని తనకు అనిపించి సంతోషంగా సహాయం చేసిందని వివరించింది. అతనికి బైబిలు సాహిత్యం ఇచ్చి యెహోవాసాక్షుల దగ్గర బైబిలు నేర్చుకోమని చెప్పింది.

పరిచయం లేనివాళ్ల పట్ల ఎవరైన ఉదారత చూపించారని విన్నప్పుడు చాలా సంతోషంగా అనిపిస్తుంది. నిస్సందేహంగా అన్నీ మతాల వాళ్లు, అసలు మతమంటే ఇష్టం లేనివాళ్లు కూడా ఇలాంటి ఉదారత చూపిస్తారు. ఏమి ఆశించకుండా వేరేవాళ్లకు ఇవ్వడం **మీకు** ఇష్టమేనా? ఆ ప్రశ్న గురించి మనం ఆలోచించాలి, ఎందుకంటే యేసు: “తీసుకోవడంలో కన్నా ఇవ్వడంలోనే ఎక్కువ సంతోషం ఉంది” అని చెప్పాడు. (అపొస్తలుల కార్యాలు 20:35) సైన్సు కూడా దీని గురించి ఆలోచిస్తుంది, ఎందుకంటే ఇవ్వడం మనకే మంచిదని పరిశోధకులు తెలుసుకున్నారు. ఎలా మంచిదో చూద్దాం.

## ‘సంతోషంగా ఇచ్చేవాళ్లు’

సంతోషం, ఇవ్వడం రెండూ ఒకే దగ్గర ఉంటాయని అనుభవాలు చూపిస్తున్నాయి. అపొస్తలుడైన పౌలు “సంతోషంగా ఇచ్చేవాళ్లంటే దేవునికి ఇష్టం” అని రాశాడు. తోటి విశ్వాసులు కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేయడానికి ధారాళంగా విరాళాలు ఇచ్చిన క్రైస్తవుల గురించి ఆయన మాట్లాడుతున్నాడు. (2 కొరింథీయులు 8:4; 9:7) వాళ్లు సంతోషంగా ఉన్నారు కాబట్టి ఇచ్చారని పౌలు చెప్పలేదు కానీ వాళ్లు ఇచ్చారు **కాబట్టి** సంతోషంగా ఉన్నారని చెప్పాడు.

ఇవ్వడం వల్ల “మెదడులో సంతోషం, ఇతరులతో సంబంధాలు, నమ్మకం, వంటి వాటికి సంబంధించిన భాగాలు చురుగ్గా పనిచేస్తాయి. దానివల్ల సంతృప్తికరమైన అనుభూతి కలుగుతుంది” అని ఒక అధ్యయనంలో తేలింది. ఇంకో అధ్యయనం “తమ కోసం డబ్బు ఖర్చు పెట్టుకున్నప్పుడు కలిగే సంతోషం కన్నా వేరే వాళ్లకు డబ్బు ఇచ్చినప్పుడు ఆ ఇచ్చిన వాళ్లకు ఎక్కువ ఆనందంగా ఉంటుంది” అని చెప్తుంది.

మీ పరిస్థితుల వల్ల పెద్దగా ఏమి ఇవ్వలేకపోతున్నారని మీకు ఎప్పుడైనా అనిపించిందా? నిజం ఏంటంటే, ప్రతీ ఒక్కరూ ‘సంతోషంగా ఇస్తూ’ ఉంటే ఆనందాన్ని పొందవచ్చు. మంచి ఉద్దేశంతో ఇస్తే, ఇచ్చేది పెద్ద మొత్తం కాకపోయినా

ఫర్వాలేదు. ఒక యెహోవాసాక్షి ఈ పత్రిక ప్రచురణకర్తలకు విరాళం పంపుతూ ఇలా రాసింది: "ఇన్ని సంవత్సరాలు మీటింగ్ హాల్లో కొంత డబ్బు విరాళంగా ఇవ్వడం తప్ప నేను ఏమి ఇవ్వలేకపోయాను." అయితే ఆమె ఇంకా ఇలా అంటోంది, "నేను ఇచ్చిన దానికన్నా ఎన్నోరెట్లు యెహోవా నాకు ఇచ్చాడు. . . . ఇలా ఇవ్వగలిగే అవకాశాన్ని నాకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు ఎందుకంటే, అది నాకు సంతృప్తిని ఇచ్చింది."

మనం ఇవ్వగలిగింది కేవలం డబ్బే కాదు. ఇవ్వడానికి ఇంకా ఎన్నో ఉన్నాయి.

## ఇవ్వడం మీ ఆరోగ్యానికి మంచిది

బైబిలు ఇలా చెప్తుంది: "దయగలవాడు తనకే మేలు చేసికొనును క్రూరుడు తన శరీరమునకు బాధ తెచ్చుకొనును." (సామెతలు 11:17) దయగలవాళ్లు ఉదారంగా ఉంటారు. సమయాన్ని, శక్తిని ఇస్తూ ఇతరుల మీద శ్రద్ధ చూపిస్తూ ఇలాంటివి ఎన్నో చేస్తూ తమకున్న వాటిని ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు. జీవితంలో దీన్ని అలవాటు చేసుకుంటే చాలా విధాలుగా ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా అది మన ఆరోగ్యానికి మంచిది.

ఇతరులకు సహాయం చేస్తూ ఉండే వాళ్లకు బాధలు, నొప్పులు, డిప్రెషన్ తక్కువగా ఉంటాయని అధ్యయనాలు చూపిస్తున్నాయి. మొత్తం మీద వాళ్లకు మంచి ఆరోగ్యం ఉంటుంది. ఉదారంగా ఇచ్చే కొంతమందికి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు అంటే మల్టిపుల్ స్క్లెరోసిస్, హెచ్‌ఐవి లాంటివి ఉన్నా వాళ్ల ఆరోగ్యం మెరుగౌతుంది. తాగుడు మానుకోవాలని అనుకునేవాళ్లు ఇతరులకు సహాయం చేస్తే ఎక్కువగా కృంగిపోకుండా, మళ్లీ తాగుడుకు అలవాటు పడిపోకుండా ఉండగలుగుతారు.



ఇవ్వడం మీకు, ఇతరులకు మంచి చేస్తుంది

ఎందుకంటే, "దయ, ఔదార్యం, కనికరంతో ఆలోచిస్తే ప్రతికూల ఆలోచనలు తక్కువగా ఉంటాయి." ఇచ్చే అలవాటు ఉంటే ఒత్తిడి లేదా టెన్షన్, బి.పి. కూడా తగ్గవచ్చు. వివాహ జతను కోల్పోయిన వాళ్లు ఇతరులకు సహాయం చేయడం వల్ల డిప్రెషన్ లక్షణాల నుండి త్వరగా కోలుకున్నారు.

సందేహమే లేదు. ఇతరులకు ఇవ్వడం వల్ల మీకు మంచి జరుగుతుంది.

## మీరు ఇస్తూ ఉంటే ఇతరులు కూడా ఇవ్వడం నేర్చుకుంటారు

యేసు తన అనుచరులను: "ఇవ్వడం అలవాటు చేసుకోండి, అప్పుడు ప్రజలు మీకు ఇస్తారు. వాళ్లు మంచి కొలతతో మీ ఒళ్లో పోస్తారు; వాటిని అదిమి, కుదిపి, పొర్లిపోయేంతగా పోస్తారు. మీరు ఏ కొలతతో కొలుస్తారో, వాళ్లూ మీకు అదే కొలతతో కొలుస్తారు" అని చెప్పాడు. (లూకా 6:38) మీరు ఇతరులకు ఇచ్చినప్పుడు వాళ్లు మీ ఉదారతకు కృతజ్ఞత చూపిస్తారు, వాళ్లు కూడా ఉదారంగా ఇవ్వడం నేర్చుకుంటారు. ఇవ్వడం వల్ల సహకారం, స్నేహం పెరుగుతాయి.

మనుషుల మధ్య బంధాలను అధ్యయనం చేసే పరిశోధకులు ఈ విషయాన్ని గమనించారు: "ఇచ్చే అలవాటు ఉన్న వాళ్లు ఇతరులు కూడా అలా ఇచ్చేలా ప్రోత్సహిస్తారు. కనికరంతో ఇతరులకు ఇచ్చిన అసాధారణ కార్యాల గురించి చదివి కూడా ధారాళంగా ఇచ్చే అలవాటును పెంచుకుంటారు." ఒక అధ్యయనం ప్రకారం, "మనుషుల మధ్య ఉన్న పరిచయాల వల్ల ఒక వ్యక్తి తనకు తెలిసిన వాళ్లను, తెలియని వాళ్లను, చాలామందిని, బహుశా వందల మందిని కూడా ప్రభావితం చేయగలడు." మరో మాటలో చెప్పాలంటే, నీటిలో ఏర్పడే ఒక చిన్న కదలిక మొత్తం నీరంతా వ్యాపించినట్లే ఉదారంగా చేసిన ఒకే ఒక పని ఒకరి ద్వారా ఇంకొకరిని ప్రభావితం చేస్తూ, పూర్తి సమాజాన్ని ప్రభావితం చేయవచ్చు. అలాంటి సమాజంలో జీవించాలని మీరు కోరుకోవడం లేదా? అవును, అందరూ ఇవ్వడం నేర్చుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి.

దీన్ని వివరించే ఒక అనుభవాన్ని చూడండి, ఇది అమెరికాలో ఫ్లోరిడా అనే ప్రాంతంలో జరిగింది. పెద్ద తుఫాను వచ్చిన తర్వాత, కొంతమంది యెహోవా సాక్షులు సహాయక చర్యలు చేయడానికి వచ్చారు. వాళ్లు బాగు చేయాల్సిన ఇంటి దగ్గర సామాన్ల కోసం ఎదురు చూస్తుండగా పక్కనే ఉన్న ఒక ఇంటి ఫెన్స్ పాడైనట్టు గమనించి దాన్ని బాగు చేస్తామని అడిగారు. ఆ ఇంటి వ్యక్తి కొంత కాలం తర్వాత యెహోవాసాక్షుల ప్రధాన కార్యాలయానికి ఇలా లెటర్ రాశాడు: “నేను ఎప్పటికీ కృతజ్ఞుణ్ణి. నేను ఇప్పటి వరకు కలిసిన వాళ్లలో ఇంత మంచి వాళ్లను ఎప్పుడూ చూడలేదు.” యెహోవా సాక్షులు గొప్ప పని చేస్తున్నారని చెప్పి కృతజ్ఞతగా ఆ పనికి ఉపయోగపడేలా ఉదారంగా విరాళం ఇచ్చాడు.

## ఇతరులకు ఇచ్చే విషయంలో అతి గొప్ప మాదిరిని అనుకరించండి

సైన్స్ పరిశోధనలో తేలిన అద్భుతమైన విషయం ఏంటంటే “ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన స్వతహాగా మనిషిలో ఉంది.” పిల్లల గురించి ఆ అధ్యయనం “మాటలు రాకముందే ఇతరులకు సహాయం చేయాలనే లక్షణం వాళ్లలో ఉంటుంది” అని చెప్తుంది. ఎందుకు? దానికి జవాబు బైబిలు వివరిస్తుంది. మనిషి “దేవుని స్వరూపంలో” సృష్టించబడ్డాడు, అంటే, దేవునికి ఉన్న లక్షణాలే మనిషికి కూడా ఉన్నాయి.—ఆదికాండము 1:27.

మన సృష్టికర్తయైన యెహోవా దేవునికి ఉన్న అద్భుతమైన లక్షణాల్లో ఉదారత ఒకటి. ఆయన మనకు ప్రాణాన్ని, సంతోషంగా ఉండడానికి అవసరమైన ప్రతీ దాన్ని ఇచ్చాడు. (అపొస్తలుల కార్యాలు 14:17; 17:26-28) మన పరలోక తండ్రిని బాగా తెలుసుకోవడానికి, ఆయన మనకోసం ప్రేమతో చేసిన సంకల్పాలను తెలుసుకోవడానికి ఆయన వాక్యమైన బైబిలును లోతుగా చదవాలి. భవిష్యత్తులో మనం సంతోషంగా ఉండడానికి ఆయన ఏర్పాట్లు చేశాడని కూడా ఆ పుస్తకం వెల్లడి చేస్తుంది.*



ఇవ్వడం వల్ల సహకారం, స్నేహం పెరుగుతాయి

(1 యోహాను 4:9, 10) యెహోవా దేవుడు ఉదారతకు మూలం, పైగా మీరు ఆయన స్వరూపంలో సృష్టించబడ్డారు కాబట్టి దేవుణ్ణి అనుకరించే వాళ్లుగా ఇవ్వాలనే లక్షణం మీకు ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఉదారత చూపించినప్పుడు మీకే మంచి జరుగుతుంది, దేవుని ఆమోదం కూడా పొందుతారు.—హెబ్రీయులు 13:16.

ఈ ఆర్టికల్ మొదట్లో మాట్లాడుకున్న అలెగ్జాండ్రా మీకు గుర్తుందా? ఆమె కథ ఎలా మలుపు తిరిగింది? ఇక ఆమె డబ్బులు పోయినట్టే అని తోటి ప్రయాణికుడు ఆమెతో చెప్పాడు. కానీ చివరికి బస్సు ఆగినప్పుడు ఆ చైనీస్ అతను తన స్నేహితులను కలిసి ఆమె ఇచ్చిన 20 డాలర్లను వెంటనే తిరిగి ఇచ్చేశాడు. అంతేకాదు, అలెగ్జాండ్రా చెప్పినట్లు అతను బైబిలు అధ్యయనం చేయడం మొదలుపెట్టాడు. మూడు నెలల తర్వాత, పెరూలో చైనీస్ భాషలో జరిగిన యెహోవాసాక్షుల సమావేశంలో ఆమె అతణ్ణి చూసి చాలా సంతోషించింది. అలెగ్జాండ్రా చేసిన దానంతటికీ కృతజ్ఞతగా ఆమెను, ఆమెతో సమావేశానికి ప్రయాణించి వచ్చిన వాళ్లను తన రెస్టారెంట్‌కు ఆహ్వానించాడు.

ఇతరులకు ఇవ్వడం, సహాయం చేయడం ఎంతో సంతోషాన్ని తెస్తుంది. అంతేకాదు, ప్రతీ మంచి బహుమానానికి మూలమైన యెహోవా దేవుణ్ణి బాగా తెలుసుకునేలా ప్రజలకు సహాయం చేస్తే మీ సంతోషం ఇంకా పెరుగుతుంది. (యాకోబు 1:17) ఇలా ఇతరులకు ఇవ్వడం వల్ల వచ్చే ప్రయోజనాలను మీరు పొందుతున్నారా? ■

* ఈ విషయం గురించి ఎక్కువ తెలుసుకోవడానికి యెహోవాసాక్షులు ప్రచురించిన *బైబిలు నిజంగా ఏమి బోధిస్తోంది?* పుస్తకం చూడండి. ఈ పుస్తకం www.jw.org/te వెబ్‌సైట్‌లో కూడా ఉంది. ప్రచురణలు > పుస్తకాలు & బ్రోషుర్‌లు చూడండి.

## మనం “చివరి రోజుల్లో” జీవిస్తున్నామా?

**మీరేం నమ్ముతున్నారు?**

- అవును
- కాదు
- తెలీదు

**పరిశుద్ధ లేఖనాలు ఏమంటున్నాయి?**

“చివరి రోజుల్లో ప్రమాదకరమైన, కష్టమైన కాలాలు వస్తాయి.” (2 తిమోతి 3:1) బైబిలు ప్రవచనాలతోపాటు, ఇప్పుడు జరిగే సంఘటనలు బట్టి మనం “చివరి రోజుల్లో” జీవిస్తున్నామని చెప్పవచ్చు.

**బైబిలు ఇంకా ఏమి చెప్తుంది?**

- చివరి రోజుల్లో యుద్ధాలు, కరువులు, భూకంపాలు, ప్రాణాంతక అంటువ్యాధులు ఎక్కువగా ఉంటాయి. —మత్తయి 24:3, 7; లూకా 21:11.
- చివరి రోజుల్లో మానవ సమాజం అంతా నైతికంగా, ఆధ్యాత్మికంగా చెడిపోతుంది.—2 తిమోతి 3:2-5.

## మనుషుల భవిష్యత్తు ఎలా ఉంటుంది?

**కొందరి నమ్మకాలు:**

భూమితోపాటు ప్రజలు అందరూ నాశనం అవడంతో చివరి రోజులు ముగుస్తాయని కొందరు నమ్ముతారు, మరికొందరు పరిస్థితులు బాగవుతాయని నమ్ముతారు.

**మీరేమంటారు?**

**పరిశుద్ధ లేఖనాలు ఏమంటున్నాయి?**

“నీతిమంతులు భూమిని స్వతంత్రించుకొందురు వారు దానిలో నిత్యము నివసించెదరు.”—కీర్తన 37:29.

**బైబిలు ఇంకా ఏమి చెప్తుంది?**

- చెడునంతటినీ తీసి వేయడంతో చివరి రోజులు ముగుస్తాయి.—1 యోహాను 2:17.
- భూమంతా అందమైన తోటలా మారుతుంది. —యెషయా 35:1, 6.



చివరి రోజులను తప్పించుకున్న వాళ్లకోసం పరదైసు భూమి ఎదురుచూస్తుంది




*బైబిలు నిజంగా ఏమి బోధిస్తోంది?* పుస్తకం నాకు పంపించండి

“చివరి రోజులు” గురించి ఎక్కువ తెలుసుకోవడానికి యెహోవాసాక్షులు ప్రచురించిన *బైబిలు నిజంగా ఏమి బోధిస్తోంది?* పుస్తకం 9వ అధ్యాయం చూడండి

ఈ పుస్తకం **www.jw.org/te** వెబ్‌సైట్‌లో కూడా ఉంది

భాష __________

పేరు __________

అడ్రస్ __________

మా అడ్రస్ కోసం 2వ పేజీ చూడండి

JW.ORG™

ఈ పత్రికను, ముందు పత్రికలను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోండి

ఇంటర్నెట్‌లో 130 కన్నా ఎక్కువ భాషల్లో బైబిలు ఉంది

**www.jw.org/te** చూడండి లేదా ఈ కోడ్ స్కాన్ చేయండి

wp17.2-TU 161124